క్లుప్తంగా

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



సింహవాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్‌: నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాథుడు సింహ వాహనంపై సతీ సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. పులివెందుల మున్సిపాలిటీలోని రంగనాథస్వామి ఆలయంలో బుధవారం రెండో రోజున అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వనభోజనం చేశారు. ఆలయ చైర్మన్‌ సుధీకర్‌రెడ్డి, ఈఓ కెవి.రమణ పర్యవేక్షించారు.

రేపు చర్మవ్యాధి నిపుణుల రాక

పులివెందుల: పట్టణంలోని ప్రముఖ ఆసుపత్రి దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(ఇ.సి.గంగిరెడ్డి)కు శుక్రవారం ప్రముఖ చర్మ వ్యాధుల వైద్యులు డా.ఎస్‌.సౌజన్య రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు బుధవారం తెలిపాయి. సోరియాసిస్‌, తామర, గజ్జి, ఫంగస్‌, ఇన్‌ఫెక్షన్‌, మొటిమలు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, చలిపిరి, అలర్జీ, ఆనెలు, పులిపిర్లు, పేనుకొరుకుల, జుట్టురాలుట, గోరుపుచ్చుట, ముఖం మీద మచ్చలు, టిబి, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధి రోగులను ఆయన పరీక్షిస్తారన్నారు. ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆసుపత్రి వర్గాలు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వినాయకుడికి వినతిపత్రం



వినతిపత్రం ఇస్తున్న ఎల్లయ్య, తదితరులు

జమ్మలమడుగు: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని వినాయకుడిని వేడుకున్నట్లు డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయకుడికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి వంటి హామీలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, నాగరాజు, మహేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో ఫైబర్‌నెట్‌



ఫైబర్‌నెట్‌ సేవలు ప్రారంభిస్తున్న వైఎస్‌ మనోహర్‌రెడ్డి, జియో ప్రతినిధులు

పులివెందుల రూరల్‌: పులివెందుల ప్రాంతంలో జియో ఫైబర్‌నెట్‌ సేవలు వినియోగించుకోవాలని మున్సిపల్‌ ఇన్‌ఛార్జ్‌ వైఎస్‌.మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జియో ఫైబర్‌నెట్‌ 5జీ సేవలను రిలయన్స్‌ సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, శరత్‌కుమార్‌ రెడ్డిలతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కరోనా అనంతరం ప్రతి ఇంటా ఇంటర్నెట్‌ ప్రాథమిక అవసరంగా మారిందన్నారు. ఇందుకు అనుగుణంగా ఇండియన్‌ జియో సంస్థ అత్యధిక వేగంతో ఇంటర్నెట్‌, టీవీ, ఇతర ఆఫర్లతో సేవలను ప్రారంభించడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిశోర్‌, కోడి రమణ, శేఖర్‌రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌ భారత్‌ ఆరోగ్య సేవలు వరం

ప్రొద్దుటూరు క్రైం : ఆయుష్మాన్‌ భారత్‌ ఆరోగ్య, సంరక్షణ కేంద్రాల సేవలు పేదలకు వరమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో ఫ్యామిలీ ఫిజిషియన్‌ కాన్సెప్ట్‌లో పాల్గొన్న ఆయన ప్రజలకు బీపీ, షుగర్‌ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలందరికి వివరించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ బీపీ వరప్రసాద్‌, సీహెచ్‌ఓ సీనారేచల్‌, ఆరోగ్య కార్యకర్తలు సుబ్బయ్య, అరుణ, దీప్తి పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్యా

పులివెందుల టౌన్‌: పులివెందుల పట్టణంలో చవితి నుంచి పూజలందుకున్న బొజ్జగణపయ్య నిమజ్జన వేడుకలు బుధవారం కోలాహలంగా జరిగాయి. శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయం వద్ద ఉదయం అన్నదానం నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల మధ్య యువకులు చిందులేస్తూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.

పులివెందుల రూరల్‌: పులివెందుల మండల వ్యాప్తంగా మూడు రోజులపాటు వినాయకులకు పూజలు చేసి బుధవారం వీడ్కోలు పలికారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. ఇనగలూరు వాగులో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐలు రాజు, మద్దిలేటి, ఎస్సైలు హుస్సేన్‌, సత్యనారాయణ గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ఊరేగింపు:

తొండూరు: మండలంలోని బుధవారం ఉదయం నుండే వినాయక విగ్రహాల గ్రామోత్సవం ప్రారంభమైంది. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఇనగలూరు సమీపంలోని రాజసేతు సాగర్‌లో నిమజ్జనం చేశారు. తొండూరు మండలమేగాక, పులివెందుల, ముద్దనూరు, మండలాల భక్తులు తరలివచ్చారు. గంగనపల్లెలో గణేష్‌ నిమజ్జన వేడుకలో ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ వర్గానికి చెందిన ఇరువురు వినాయక నిమజ్జనంలో టెంకాయ కొట్టేందుకు పోటీ పడడంతో వాగ్వాదం పెరిగింది. దీంతో ఇరు వర్గాలు మిద్దెలెక్కి రాళ్లు విసురుకోవడంతో పలువురు గాయపడినట్లు ఎస్సై తెలిపారు.

బాణసంచా పేలుస్తూ:

వేముల: మండలంలో మూడు రోజులపాటు పూజలందుకున్న వినాయక ప్రతిమలను బ్యాండు మేళాలతో, బాణాసంచా పేలుస్తూ ఘనంగా ఊరేగించారు. మండలంలోని గొందిపల్లి, పెద్దజూటూరు, చింతలజూటూరు, నల్లచెరువుపల్లె, నారేపల్లె, కొండ్రెడ్డిపల్లె, రాచకుంటపల్లె, వేల్పుల, మబ్బుచింతల పల్లె గ్రామాల్లో నిమజ్జనం చేశారు.



వెలిదండ్లలో వినాయక విగ్రహాల ఊరేగింపు, చిందులు వేస్తున్న యువకులు

చిన్నారుల ఆనందం

లింగాల: మండలంలో యువకులు, పిల్లలు, మహిళలు పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను వాహనాలలో కొలువుదీర్చి ఊరేగించారు. డీజే పాటలకు చిందులేస్తూ కుంటలలో ప్రతిమలను నిమజ్జనం చేశారు.

జై బోలో గణేష్‌ మహారాజ్‌

కమలాపురం: జై బోలో గణేష్‌ మహారాజ్‌కీ.. జై అంటూ భక్తులు గణనాధుడిని ఊరేగించారు. కుందూ నదిలో ఘనంగా నిమజ్జనం చేశారు. కమలాపురం పట్టణంతోపాటు మండలంలోని కొండాయపల్లె, గంగవరం, విభరాపురం, అప్పాయపల్లె, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె తదితర గ్రామాలలో విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. కమలాపురం సీఐ రామక్రిష్టారెడ్డి, ఎస్‌ఐ చిన్నపెద్దయ్య బందోబస్తు నిర్వహించారు.

మండపాల వద్ద ఎమ్మెల్యే పూజలు

చెన్నూరు: వినాయక మండపాల వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు, చెన్నూరు మండలం రామనపల్లిలో 24 వంటకాలతో అన్నదానం చేశారు. కేఓఆర్‌ నగర్‌ ఎల్లమ్మ దేవాలయం వద్ద వినాయకుడిని కమలాపురం ఎమ్మెల్యే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూరు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చెన్నూరు బెస్తకాలనీ, లక్ష్మీ నగర్‌, సరస్వతీనగర్‌, కొత్త గాంధీనగర్‌, అరుంధతి నగర్‌, తదితర ప్రాంతాల్లో పలువురు పూజలు చేశారు. చెన్నూరు హైవే వంతెనపై నుంచి పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

రూ.1.15 లక్షలు పలికిన లడ్డు

వీరపునాయునిపల్లె: వినాయకుడి నిమజ్జనోత్సవం బుధవారం వైభవంగా సాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాల వద్ద అన్నదానం చేశారు. అలంకరించిన ట్రాక్టర్లపై విగ్రహాలను ఉంచి బాణసంచా పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. నడివీధి గంగమ్మ వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డుకు వేలం పాట నిర్వహించగా, సంగమేశ్వర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నర్రెడ్డి బ్రహ్మానందరెడ్డి కుమారుడు హితేష్‌రెడ్డి రూ.1.15 లక్షలకు దక్కించుకున్నారు. బోగామ్మ తల్లి వద్ద ఏర్పాటుచేసిన లడ్డును సగిలి శ్రీకాంత్‌రెడ్డి రూ.19వేలకు, మారుతీనగర్‌లో రూ.42వేలకు గుగ్గిల్ల సుబ్బారెడ్డి, అనిమెల రహదారిలోని విగ్రహం వద్ద లడ్డును నీలం శివగంగాధర్‌ రూ.25 వేలకు దక్కించుకొన్నారు. యరమలపల్లెలో వినాయకుడి వద్ద ఉంచిన లడ్డు రూ.65 వేలకు చంద్రశేఖర్‌ దక్కించుకోగా 5గ్రాముల వెండి నాణెం రూ.42 వేలకు రామచంద్రారెడ్డి దక్కించుకొన్నారు.

ముద్దనూరు: మండలంలోని పలు ప్రాంతాల నుంచి గణేష్‌ విగ్రహాలు బుధవారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. మండపాల వద్ద అన్నదానం చేశారు. శమైలవరం మండలంలోని ధన్నవాడలో విగ్రహాలను ప్రత్యేక ట్రాక్టర్లలో తరలించారు. స్థానిక జీఎన్‌ఎస్‌ఎస్‌ కాలువలో నిమజ్జనం జరిపారు.

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు, మర్రిమాకులపల్లె, పగడాలపల్లె, చెర్లోపల్లె, ద్వారకానగర్‌, మిట్టమీదపల్లె తదితర గ్రామాలల్లో బుధవారం ఘనంగా గణనాథుని నిమజ్జ వేడుకలు నిర్వహించారు. సమీపంలో కుంటల్లో నిమజ్జనం చేశారు.

రూ.1.53 లక్షలు పలికిన వినాయక లడ్డు

ఎర్రగుంట్ల: మండలంలోని కలమల్ల ఆర్టీపీపీ గేటు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుధవారం అభిషేక పూజలు జరిపారు. వరసిద్ధి వినాయక ఉత్సవ యూత్‌ కమిటీ ఆధ్వర్యంలో వినాయక లడ్డు వేలం పాట నిర్వహించగా కె ఓబుళరెడ్డి రూ.1.53 లక్షలకు దక్కించుకున్నారు. డాలర్‌ను బి.నరసింహారెడ్డి రూ.81 వేలకు దక్కించుకున్నారు. రాజీవనం కాలనీలో ఎంఆర్‌ఓ కార్యాలయం రోడ్డునందు వినాయక లడ్డును రూ.11516కు ప్రసాదర్‌రెడ్డి, రాధ దంపతులు దక్కించుకున్నారు.

వైభవం.. గ్రామోత్సవం

వల్లూరు: మండలంలోని పెద్దపుత్త ఎస్సీ కాలనీ, దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్‌ కాలనీ, గంగాయపల్లె, ధర్మాపురం కాలనీ తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. యువకుల కర్రసాములు, సాహస విన్యాసాలు అలరించాయి. గంగాయపల్లెలో గణేషుని లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా వైఎస్‌ఆర్‌సీపీ నేత నిమ్మకాయల శశిధర్‌రెడ్డి రూ 25,500 కు దక్కించుకున్నారు.



వల్లూరులో గణేషుని గ్రామోత్సవం



రూ.1.15 లక్షలకు దక్కించుకున్న లడ్డుతో హితేష్‌కుమార్‌రెడ్డి



దప్పు వాయిద్యాలతో నిమజ్జనానికి తీసుకెళ్తున్న వినాయక విగ్రహాలు



కలమల్లలో వేలంలో లడ్డును రూ.1.53 లక్షలకు దక్కించుకున్న ఓబుళరెడ్డి



నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



గొందిపల్లెలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



కొండాపురంలో లడ్డు గెలుచుకున్న శివ



కమలాపురంలో విగ్రహాలు తరలిస్తున్న భక్తులు



కేఓఆర్‌ కాలనీలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పూజలు

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్‌ మల్లికార్జున రెడ్డి



ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి, చిత్రంలో ఆర్టీసీ ఛైర్మన్‌ మల్లికార్జున రెడ్డి

కమలాపురం: కమలాపురం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలదించడమే లక్ష్యంగా నూతన ఆసుపత్రి భవనం రూపుదిద్దుకుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.8.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ఆర్టీసీ ఛైర్మన్‌ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్‌ రామాంజులరెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే డ్రైనేజ్‌, పాలిటెక్నిక్‌ కళాశాల పూర్తి చేశామన్నారు. రూ.58 కోట్లతో పైప్‌లైన్‌, ఓవర్‌హెడ్‌ ట్యాంకులు, రోడ్డు విస్తరణ, డివైడర్‌ పనులు జరుగుతున్నాయన్నారు. ఆర్టీసీ ఛైర్మన్‌ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పులివెందుల తర్వాత కమలాపురం నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్‌ ఉత్తమారెడ్డి, మార్కెట్‌ యార్డు ఛైర్మన్‌ పుల్లారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మహ్మద్‌ సాదిక్‌, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం: వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి తెలిపారు. 80 శాతం రాయితీతో మినుము విత్తనాలను కమలాపురం 4వ ఆర్‌బీకేలో బుధవారం రైతులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, నరేన్‌ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కమలాపురం: పట్టణంలోని వినాయక విగ్రహాల వద్ద ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగంపల్లె ఎస్సీ కాలనీలో రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. రామాంజులరెడ్డిని పట్టణంలోని శిలా వీధికి చెందిన యువత ఘనంగా సన్మానించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయ నిధి కింద రూ.5 లక్షల చొప్పున చెక్కులను ఐదుగురికి బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు చెక్కు రూపంలో వచ్చిన నగదును తమ ఆరోగ్య అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. వైద్యం చేయించుకున్న వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



ఆడిట్‌ నిర్వహిస్తున్న ఏపీడీ నాగరత్నమ్మ

తొండూరు: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ ఏపీడీ నాగరత్నమ్మ హెచ్చరించారు. తొండూరు మండలంలో ఉపాధి హామీ పథకంపై బుధవారం ఆడిట్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 సెప్టెంబర్‌ 6 నుంచి 2023 సెప్టెంబర్‌ 19 వరకు 15 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులను తనిఖీ చేశారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ విభాగంలో వేతనాలు, సామగ్రి రూపంలో రూ.9,26,85,834 నిధుల వినియోగంపై ఆడిట్‌ జరిగిందని తెలిపారు. జిల్లా విజిలెన్స్‌ ఆఫీసర్‌ యోగాంజనేయులరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన వారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుబ్బారెడ్డి, కృష్ణ ప్రసాద్‌, జడ్పీటీసీ రామమునిరెడ్డి, ఎంపీపీ నారాయణమ్మ, ఏపీఓ జయభారతి, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, గంగాధరరెడ్డి

పులివెందుల రూరల్‌: తెలుగుదేశం పార్టీ మనుగడ కోసం మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌ రవి బలవంతంగా కొందరిని పిలిచి పార్టీ కండువాలు కప్పుతున్నారని మున్సిపల్‌ ఛైర్మన్‌ వరప్రసాద్‌, రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గంగాధరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని నగరిగుట్టకు చెందిన కొంతమంది వైఎస్సార్సీపీ కార్యకర్తలు ఆ దారిలో వెళ్తుండగా వారిని పిలిచి మరీ కండువాలు కప్పారని ఎద్దేవా చేశారు. వైఎస్‌ఆర్‌ కుటుంబంతో ఉన్నవారికి మాయమాటలు చెప్పి టీడీపీ కండువాలు కప్పడం ఏమిటంటూ వారు ప్రశ్నించారు. పార్టీపై బురదజల్లే ఆరోపణలు మానుకొని స్వచ్ఛందంగా పార్టీలోకి వచ్చే వారిని ఆహ్వానించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి అంటే తమకు అభిమానమన్నారు. అభిమానులకు మాయమాటలు చెప్పి కండువాలు కప్పడం మానుకోవాలన బీటెక్‌ రవికి హితవు పలికారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి



గంగరాం కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి

వేంపల్లె: ట్రిపుల్‌ ఐటీ అధికారుల నిర్లక్ష్యంతోనే పులివెందుల తాలూకా లింగాల మండలం తేర్నాంపల్లె గ్రామానికి చెందిన గంగారామ్‌ మృతి చెందాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో గంగరాం మృతదేహాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన విద్యార్థులు కష్టపడి ట్రిపుల్‌ ఐటీలో సీటు సంపాదించుకుని వస్తే అధికారుల పర్యవేక్షణ లోపంతో మృతి చెందడం దురదృష్టకరమన్నారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరి ప్రసాద్‌, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సునీల్‌కుమార్‌, కిరణ్‌కుమార్‌, చరణ్‌, సుమన్‌, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ విధానం మాత్రమే అమలుచేయాలి

ప్రొద్దుటూరు : జీపీఎస్‌ను ఒప్పుకోమని పాత పెన్షన్‌ విధానం మాత్రమే అమలు చేయాలని ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బరాజు యాదవ్‌ తెలిపారు. స్థానిక అనిబిసెంట్‌ మున్సిపల్‌ హైస్కూల్‌లో బుధవారం ఎస్టీఎఫ్‌ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్యారెంటీ పెన్షన్‌ స్కీంను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ జీపీఎస్‌ను బలవంతంగా రుద్దటాన్ని ఒప్పుకోవాలని, మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేసినట్లుగానే పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలసి పెద్ద ఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్‌టీఎఫ్‌ నాయకులు రామ్మోహన్‌, వినోద్‌కుమార్‌, నరేష్‌, జోసెఫ్‌, గురయ్య, హరి రామకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్‌.మనోహర్‌రెడ్డి, వైఎస్‌.మధురెడ్డి

పులివెందుల రూరల్‌: రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని వైఎస్సార్సీపీ నాయకులు వైఎస్‌.మనోహర్‌రెడ్డి, వైఎస్‌.మధురెడ్డి అన్నారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని సబ్‌ స్టేషన్‌ వద్ద నందు యువత ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్‌.మనోహర్‌రెడ్డి, వైఎస్‌.మధురెడ్డి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామమల్లేశ్వరరెడ్డి, చిన్నప్ప, కోడిరమణ, కిశోర్‌, గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగాల కుడికాలువ పరిశీలన



నిపుణుల కమిటీతో చర్చిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

లింగాల : లింగాల కుడికాలువ, పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌ లింకులకు గురవుతున్నాయని, దీనివల్ల రైతుల పొలాల్లో నీరు ప్రవహించి జౌకులెత్తి పంటలు పండించుకోవడానికి వీలులేకుండా పోతోందని గత ఏడాది రైతులు కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో బుధవారం నీటిపారుదలశాఖ, అగ్రికల్చర్‌ శాఖలకు సంబంధించిన అధికారులు, లింగాల కుడికాలువ, పీబీసీ కెనాల్‌పై పర్యటించారు. లింగాల కుడికాలువ 1619 కిలోమీటర్ల వద్ద వారు పరిశీలించారు. అదే విధంగా కామసముద్రం చెరువు, నక్కలపల్లె సమ్మర్‌ స్టోరేజ్‌లను పరిశీలించారు. పీబీసీ కెనాల్‌కు అక్కడక్కడ ఉన్న వంకలు, వాగులను కొందరు రైతులు పూడ్చివేయడం వల్ల కాలువలకు లీకేజీ ఏర్పడి ఆ నీరు పొలాల్లోకి చేరుతోందన్నారు. కామసముద్రం చెరువులో నీరు నిల్వ ఉండడం వల్ల కిందిభాగంలోని పొలాలు జౌకులెత్తుతున్నాయన్నారు. కామసముద్రం చెరువు క్రిందిభాగంలోని పొలాల సమస్యను పరిష్కరించేందుకు లీక్‌ అవుతున్న నీటిని అరికట్టేందుకు భారీ పైపులు ఏర్పాటు చేసి భూమి అడుగు భాగంలో పైపుల ద్వారా నీటిని వంకలకు తరలించాలని సూచించారు. కాలువల సమీపంలోని వంకలు, వాగులు పూడ్చడం వల్ల లీకైన నీరు పొలాల్లోకి చేరుతోందన్నారు. తిరిగి వంకలు, వాగులను పునరుద్ధరించాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించాలని, తిరిగి లింగాల కుడికాలువ, పీబీసీ కెనాల్‌ను సందర్శిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అగ్రికల్చర్‌ ఇంజనీరింగ్‌ డీన్‌ శ్రీమతి మని, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్‌.ఎం.వి.రమణ, అగ్రికల్చర్‌ సైంటిస్టు కృష్ణారెడ్డి, నీటిపారుదలశాఖ డీఈలు, ఏఈలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న పి.సుబ్బరాయుడు, తదితరులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం మున్సిపల్‌ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు జీపీఎఫ్‌ ఖాతాలు తెరవకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. సరెండర్‌ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్‌ రెండున్నరేళ్లు దాటినా పెండింగ్‌లోనే ఉంచారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్‌ చేయాలని, క్లాప్‌ ఆటో డ్రైవర్లకు కనీస వేతనాలు, స్కూల్‌ స్వీపర్లకు ఫుల్‌ టైం జీతాలు, ఇంజనీరింగ్‌ కార్మికుల, పార్కు కూలీలకు, నగర దీపికలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని తెలిపారు. 22న మున్సిపల్‌, కార్పొరేషన్‌, నగర పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 24న ఆయా కార్యాలయ ఎదుట మానవహారాలు, 26న రీజనల్‌ డైరెక్టర్‌ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడుతామని వివరించారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లోనైనా మున్సిపల్‌ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో 27న రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించి దీర్ఘకాలిక పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటరమణయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మధు, రవిప్రసాద్‌, ఉపాధ్యక్షుడు రూబెన్‌, తదితరులు పాల్గొన్నారు.